# సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 11 । మే । 2025




**విద్యుత్ ఆదా..**

వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. స్వీయ నియంత్రణతో వృథాకు అడ్డుకట్ట వేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

-10లో



**ఉపాధి 'హాని'**

ఉపాధి పనుల్లో కూటమి కార్యకర్తలు పెత్తనం చలాయిస్తున్నారు. అనుకూలంగా ఉన్నవారు పనికిరాకపోయినా మస్తర్లు వేస్తున్నారు.

-10లో

**ఉపాధి కోర్సుల్లో శిక్షణ**

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌లో ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు శనివారం తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ (మాన్యువల్), మెటల్ ఆర్క్ వెల్డింగ్ అంశాల్లో శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగినవారు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 79891 77887 నంబరును సంప్రదించాలని కోరారు.

## న్యూస్‌రీల్

### అభ్యంతరాల స్వీకరణ

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీల భర్తీకి జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆధ్వర్యంలో రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్–1, డయాలసిస్ టెక్నీషియన్–6, సీ–ఆర్మ్ టెక్నీషియన్–2, జనరల్ డ్యూటీ అటెండెంట్లు–3, సెక్యూరిటీ–1 పోస్టుల భర్తీకి మొత్తం 289 దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. తాజాగా సవరించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేశామని, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12 నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు జిల్లా వెబ్‌సైట్ www.srikakulam.ap.gov.inను సందర్శించాలని సూచించారు.

### కబడ్డీలో సిక్కోలు జోరు



పతకాలు సాధించిన మణికంఠ, రామ్మోహన్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు జోరు కనబర్చారు. ఈ నెల 4 నుంచి 8 వరకు బీహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ బాలురు కబడ్డీ జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు సత్తారు రామ్మోహన్‌రావు (అక్కులపేట- ఆమదాలవలస మండలం), పాలక మణికంఠ (జిల్లేడుపాడు-సీతంపేట మండలం) ఉన్నారు. వీరిని జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, కోశాధికారి నాగళ్ళ రమేష్ ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, తవిటమ్మ, నారాయణరావు, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, పీఈటీ సంఘం, ఒలింపిక్ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

### హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డికి వినతి



జస్టిస్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : శ్రీకాకుళం జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి, హైకోర్టు జడ్జి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని జిల్లా అతిథి గృహంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఎక్సైజ్ కోర్టు, మొబైల్ కోర్టులకు తక్షణమే మెజిస్ట్రేట్‌లను నియమించాలని, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు, కార్యవర్గ సభ్యులు భవానీప్రసాద్, ఎ.వనజాక్షి, వరప్రసాద్, రమణమూర్తి, స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు పి.వి.రమణ, ధయాల్, పి.వి.రమణరావు, ఎన్ని సూర్యారావు, గణపతి పట్నాయక్, ఎం.క్రాంతి, కె.ఈశ్వరరావు, తిరుపతిరావు, చలం తదితరులు పాల్గొన్నారు.



# కుటిల పాక్‌కు చెక్ పెట్టాల్సిందే!

- కాల్పుల విరమణ ప్రకటించినా జాగ్రత్త అవసరం
- దేశం కోసం ప్రాణాలర్పించేందుకైనా సిద్ధమంటున్న జిల్లా మాజీ సైనికులు

యుద్ధానికి సై అంటూ ఇన్నాళ్లూ దంబాలు పలికిన పాక్ ఇప్పుడు కాల్పుల విరమణ పాట పాడుతున్నా దాని వెనుక కుటిలత్వం ఉంది. అదను చూసి మళ్లీ దొంగ దెబ్బ తీయడానికి ఏమాత్రం వెనుకాడదు. దాయాది దేశంతో ఇటువంటి అనుభవాలు గతంలో ఎదుర్కొన్నవే. అందువల్ల భారత్ తన జాగ్రత్తలో తను ఉండాలని మాజీ సైనికులు కోరుతున్నారు. పాకిస్తాన్ పీచమణిచేందుకు తాము కూడా సిద్ధమేనని సమరోత్సాహం ప్రదర్శిస్తున్నారు.



పాక్ దుశ్చర్యలను ఖండిస్తున్న మాజీ సైనికులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కాల్పుల విరమణకు అంగీకారం తెలిపినా దొంగ దెబ్బతీసే పాకిస్తాన్‌ను నమ్మకూడదని.. ఇండియా, పాకిస్తాన్ ఉద్రిక్తల నేపథ్యంలో దేశం తరపున పోరాడేందుకు తాము సిద్ధమని మాజీ సైనికులు అంటున్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా దేశం తరపున పోరాడేందుకు సిద్ధమంటూ ముందుకొస్తున్నారు. జిల్లాలో సుమారు 7500 మందికి త్రివిధ దళాల్లో పనిచేసిన అనుభవం ఉంది. మేజర్, జూనియర్ కమాండర్, లాన్స్ నాయక్, సుబేదార్, హవల్దార్‌గా పనిచేసిన వారు ఉన్నారు. తాము ఉద్యోగ విరమణ చేసినా తమలో సత్తా తగ్గలేదని చెబుతున్నారు. కార్గిల్, ఇతర ఆపరేషన్ల సమయాల్లో పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అవసరమైతే ప్రస్తుతం పనిచేస్తున్న సైనికులతో కలిసి శత్రువును మట్టి కరిపిస్తామంటున్నారు.

### కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నా..



కార్గిల్ యుద్ధం, ఓపీఎస్ పరాక్రమ ఆపరేషన్‌లో పాల్గొన్నాను. 28 ఏళ్ల సర్వీసులో ఉన్నాను. యుద్ధం సమయంలో సాంకేతికపరంగా కీలక పాత్ర పోషించాను. టెక్నాలజీ ద్వారా ప్రత్యర్థుల కదలికలను తెలుసుకుని, సైనికులకు సమాచారం ఇచ్చాను. భరతమాత కోసం ప్రాణాలైనా అర్పిస్తాను.

– ఎస్.నారాయణమూర్తి, మాజీ సుబేదార్ మేజర్

### క్లిష్ట పరిస్థితుల్లో పోరాడా..



కార్గిల్ యుద్ధ సమయంలో మైన్స్, బ్రిడ్జస్, రోడ్డు క్లియరెన్స్ చేసే పనిలో ఉండేవాడిని. సైనికులు ముందుకెళ్లాలంటే క్లియరెన్స్ తప్పనిసరి. ఆ రూట్‌లో ఎటువంటి ప్రమాదాలు జరిగినా ముందు ఎఫెక్ట్ అయ్యేది నేనే. అంతటి క్లిష్టమైన విధులు నిర్వర్తించాను.

– ఎస్.రామారావు, మాజీ హవల్దార్

### దేశం కోసం పోరాటం



యుద్ధ ప్రాతిపదికన మైన్ ఫీల్డ్‌లో ముందుకెళ్లడంతో అనుభవం ఉంది. కార్గిల్ యుద్ధంలో నా వంతు పాత్ర పోషించాను. పాకిస్తాన్‌ది మేకపోతూ గాంభీర్యం తప్ప చేసిందేమి లేదు. మనకున్న రక్షణ వ్యవస్థతో పాకిస్తాన్ పోల్చడం అనవసరం. బలమైన ఇండియాతో పోరాడే సామర్థ్యం పాకిస్తాన్‌కు లేదు.

– చౌదరి అమ్మాజీరావు, మాజీ హవల్దార్

### నేను సిద్ధం..



కార్గిల్ యుద్ధ సమయంలో ఫ్రంట్ లైన్ టీమ్‌లో ఉండేవాడిని. ప్రత్యర్థుల కదలికలను తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చేవాడిని. బంకర్ల వద్ద విధులు నిర్వర్తించాను. అ అనుభవంతో శత్రువుతో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాను.

– కీర్తి వెంకటరమణ, మాజీ హవల్దార్



# వినకపోతే వేధింపులే!



కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. తమ మాట వినని వారిని అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తున్నందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పంతం నెగ్గించుకుంటున్నారు. తాజాగా ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరులో చెరువుల ఆక్రమణలను అడ్డుకున్న సర్పంచ్ రాంబాబుపై తప్పుడు అభియోగాలు మోపి చెక్ పవర్ రద్దు చేయించారు.



కూటమి నాయకుల ఆక్రమణల నుంచి సర్పంచ్ కాపాడిన చెరువు ఇదే..

- జిల్లాలో ఆగని కూటమి ప్రభుత్వ కక్ష సాధింపులు
- తాజాగా బొంతలకోడూరు సర్పంచ్‌పై చర్యలు
- తప్పుడు అభియోగాలతో చెక్ పవర్ రద్దు
- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- తప్పు చేశానని నిరూపిస్తే పదవికే రాజీనామా చేస్తానంటూ సర్పంచ్ సవాల్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

బొంతలకోడూరులో కూటమి నాయకుల చెరువుల ఆక్రమణ అందరికీ తెలిసిందే. సర్వే నెంబర్ 57–11లోని చెరువులో రూ.3 కోట్లు విలువైన ఎకరా 94సెంట్లు, సర్వే నెంబర్ 39–8లో రూ.5కోట్లు విలువైన 3ఎకరాల చెరువు ఆక్రమణలను అక్కడ సర్పంచ్‌గా పనిచేస్తున్న పి.రాంబాబు అడ్డుకున్నారు. ఆక్రమణదారులపై పెద్ద పోరాటమే చేశారు. చివరికవి ఆక్రమణలని తేలడంతో అధికారులు సైతం చర్యలు తీసుకున్నారు. కబ్జాదారుల నుంచి చెరువులను కాపాడారు.

### సీన్ కట్ చేస్తే..

ఇప్పుడా సర్పంచ్‌పై కూటమి నాయకులు కక్ష సాధింపునకు దిగారు. తమ పార్టీ అధికారంలో ఉండటంతో అధికారులపై ఒత్తిళ్లు చేసి ఏకంగా చెక్ పవర్ రద్దు చేయించారు. తమ అక్రమాలకు అడ్డు తగులుతున్న సర్పంచ్‌లను ఎలాగైనా ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో ఉన్నత స్థాయి నేతలు జోక్యం చేసుకుని సర్పంచ్‌ను అణిచివేసేందుకు పావులు కదిపారు. దానిలో భాగంగా అర్థం లేని ఆరోపణలతో ఏకపక్షంగా అధికారులు చెక్ పవర్ తీసేశారు. ఆ మధ్య వరకు చెరువుల ఆక్రమణదారులపై పోరాడిన సర్పంచ్.. ఇప్పుడు వారి ఒత్తిళ్లతో చర్యలు తీసుకున్న అధికారులపై పోరాడుతున్నారు. తాను తప్పు చేశానని నిరూపిస్తే చెక్ పవర్ కాదు.. స్వచ్ఛందంగా తానే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.



చెరువు కబ్జా చేశాక చెరుకు తోట వేసి కూటమి నాయకులు సాగు చేసుకున్న దృశ్యం(ఫైల్)

### తప్పుడు అభియోగాలు..

ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనక భాగంలో సచివాలయం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో జిల్లా పరిషత్ సమావేశం తీర్మానం మేరకు నిర్మాణం మొదలు పెట్టారు. అయితే, 2022 జూలైలో ఏపీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు నిర్మాణం నిలుపుదల చేశారు. అప్పటికే భవన నిర్మాణానికి రూ.లక్షా 81వేల 339ల నిధులు గ్రామ పంచాయతీకి జమయ్యాయి. ఈ నేపథ్యంలో నిలిచిపోయిన సచివాలయం భవనాన్ని మరో ప్రదేశంలో నిర్మించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు సచివాలయం పూర్తై ప్రారంభోత్సవం కూడా జరిగిపోయింది. నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని పార్ట్ (ఏ)గా, కొత్త సచివాలయం భవనాన్ని పార్ట్ (బి)గా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ర్యాటిఫికేషన్ చేసి ఉత్తర్వులు కూడా జారీ చేశారు. పాత సచివాలయం కాంట్రాక్టర్ మెట్ట హరిహరరావు పేరున రూ.లక్షా 81వేల 339లను చెక్ ద్వారా సర్పంచ్ చెల్లించారు. సంబంధిత కాంట్రాక్టర్ కూడా నిధులు దుర్వినియోగం జరిగినట్టు సామాజిక విచారణలో అభ్యంతరం వ్యక్తం చేస్తే.. మొత్తం నిధులు తిరిగి చెల్లిస్తానని లిఖిత పూర్వకంగా రాసి కూడా ఇచ్చారు. అంతా పారదర్శకంగా, ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం నిర్మాణం, నిధుల వినియోగం జరిగితే పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని కూటమి నాయకులు ఇచ్చిన ఫిర్యాదుకు తలొగ్గి, ఒత్తిళ్లకు లోనై వారు చెప్పినట్టుగా వ్యవహరిస్తూ ఏకంగా సర్పంచ్ రాంబాబు చెక్ పవర్‌ను రద్దు చేశారు.

### ఆ మాత్రం తేడా తెలియదా..

సాధారణంగా ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగమైతే సామాజిక తనిఖీల్లో అభ్యంతరం వ్యక్తమవుతుంది. తేడాలుంటే రికవరీకి ఆదేశిస్తారు. అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. కానీ, ఇక్కడదేమి జరగలేదు. నిధులు దుర్వినియోగమైనట్టు సామాజిక తనిఖీల్లో ఎక్కడా తేలలేదు. కనీసం దుర్వినియోగమైనట్టు ఉత్తర్వులు కూడా జారీ కాలేదు. పంచాయతీ నిధులకు సంబంధం లేని ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం జరిగినట్టు చూపించి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. వాస్తవానికి పంచాయతీ నిధులు దుర్వినియోగమైతేనే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలి. అటువంటిదేమి లేకపోయినా ఉపాధి నిధులతో చేపట్టిన సచివాలయం భవన నిర్మాణాన్ని చూపించి, అందులో నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలు మోపి చెక్ పవర్ రద్దు చేయడం గమనార్హం. న్యాయవర్గాలు కూడా అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధి నిధులకు, పంచాయతీ నిధులకు తేడా తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై సర్పంచ్ రాంబాబు స్పందిస్తూ ఎంతవరకైనా పోరాడుతానని, అధికారులకు చిత్తశుద్ధి ఉంటే నిధులు దుర్వినియోగం ఎక్కడ జరిగిందో నిరూపించాలని, నిరూపిస్తే చెక్ పవర్ కాదు.. ఏకంగా సర్పంచ్ పదవినే వదిలేస్తానని సవాల్ విసిరారు.

## సైనికుల క్షేమం కోరుతూ మహాశాంతి యాగం



భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో శనివారం శ్రీముఖలింగం ఆలయంలో అర్చకులు, భక్తులు మహాశాంతి రుద్రయాగం నిర్వహించారు. భారత సాయుధ దళాలకు శ్రీముఖలింగేశ్వరుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీముఖలింగం గ్రామానికి చేయూత గ్రూప్ సభ్యులు ఈ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ బలరాం, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

– జలుమూరు

## సీమెన్ ఇంట్లో భారీ చోరీ

- 15 తులాల బంగారం, రూ.20 వేలు నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో అజంతా గార్డెన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి సీమెన్ ఇంట్లో భారీ చోరీ కలకలం రేపింది. స్థానిక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అర్జల గురుమూర్తి కుటుంబసమేతంగా ఈ నెల 6న పలాస మండలం అక్కుపల్లి సమీపంలోని ఉంకులూరులో తన మేనకోడలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ప్రధాన ద్వారం తలుపులు బద్దలు కొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్ బీరువా తెరిచి ఉంది. అందులో సుమారు 15 తులాల బంగారం, రూ.20వేలు నగదు కనిపించకపోవడంతో వెంటనే శ్రీకాకుళం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ రాము, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ దుండగుడు గోడ దూకి ఇంటి తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పత్రికా స్వేచ్ఛను హరిస్తారా?

- సాక్షి ఎడిటర్ నివాసంలో అక్రమ సోదాలు సరికాదు
- పోలీసుల తీరుపై సోంపేటలో జర్నలిస్టుల ధర్నా

కంచిలి/సోంపేట: పత్రికా స్వేచ్ఛను హరించేలా పోలీసులు సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో అక్రమ సోదాలు నిర్వహించడాన్ని జర్నలిస్టులు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు సోంపేటలో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీకి, సోంపేట సీఐ బి.మంగరాజుకు వినతిపత్రాలు అందజేశారు. నిరసన కార్యక్రమంలో సోంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెదుళ్ల తిరుపతిరావు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీరావు, జర్నలిస్టులు కొత్తకోట నవీన్‌కుమార్, పూడి శ్రీహరిరావు, పిరియా ధర్మేంద్ర, మద్దిల కేశవరావు, సంతోష్ సాహు, రఘువు మోహనరావు, పండి ధనుంజయరావు, భావన శ్రీకాంత్, పడాల నరేష్, గొనప రాంబాబు, రాజేష్, పిలక కృష్ణతేజ, బల్ల మోహనరావు, బాబూరావు పాల్గొన్నారు.

### దౌర్జన్యం తగదు..



సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి ఎటువంటి నోటీసులు లేకుండా పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి, సోదాలు చేయడం అమానుషమైన చర్య. పత్రికా స్వేచ్ఛను హరించేలా పోలీసులు వ్యవహరించడం సరికాదు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం.

– బీన ఢిల్లీరావు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి



సోంపేటలో నల్లబ్యాడ్జీలు ధరించి జర్నలిస్టుల నిరసన







స్వర్ణాలంకరణలో వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగమ్మ

## వైభవంగా ఊయల ఉత్సవం

జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాలో భాగంగా శనివారం ఊయల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేంటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మలను బంగారు ఆభరణాలతో అలంకరించారు. మహా మండపంలో ఊయలను ఏర్పాటు చేసిన స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుతీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

## క్లుప్తంగా

### సీఎం చంద్రబాబుకు మహిళలంటే చిన్నచూపు

- ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకుడు లక్ష్మణరావు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం చంద్రబాబుకి మహిళలంటే చిన్నచూపు అని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకుడు, వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఏబీసీఎఫ్ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. రాష్ట్రంలో మాజీ మంత్రి స్థాయి వ్యక్తికే సరైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో పోలీసు యంత్రాంగం, కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు కొనసాగిస్తే ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ తరుపున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

### యోగాతో మానసిక ప్రశాంతత



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ప్రొఫెసర్ ఈశ్వరరావు

రణస్థలం: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ యోగా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఈశ్వరరావు అన్నారు. లావేరు మండలంలోని బుడుమూరు విజ్ఞాన కేంద్రంలో హరిత ఇంటిగ్రేటెడ్ గ్రామీణ అభివృద్ధి సొసైటీ, బుడుమూరు యూత్ అసోసియేషన్ సంయుక్తంగా శనివారం నిర్వహించిన విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి యోగ, ధ్యానం శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చరవాణిల వలన విద్యార్థుల్లో సృజనాత్మకతను కోల్పోవడమే కాకుండా, విపరీతమైన కోపం, చిరాకు, అభద్రతాభావం పెరిగిపోయి ఒత్తిడితో సతమతమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు, బుడమూరు యూత్ అసోసియేషన్ కార్యదర్శి కనకరాజు, సభ్యులు సత్యరాజు, అనిల్ కుమార్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్‌కు గాయాలు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యలమంచిలి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కవిటి రామరాజు గాయపడ్డారు. కోటబొమ్మాళి వైపు వస్తుండగా అదుపు తప్పి ద్విచక్రవాహనం బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన రామరాజును చికిత్స నిమిత్తం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

### రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



సురేష్ మృతదేహం


ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద శనివారం సాయంత్రం రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు వివరాలు వెల్లడించారు. రేగిడి ఆమదాలవలస మండలం పుర్లె గ్రామానికి చెందిన రేగిడి సురేష్(28) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు సురేష్ శ్రీకాకుళంలో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడని, శుక్రవారం రేగిడి ఆమదాలవలసలో ఒక వివాహానికి హాజరై వస్తానని పనిచేసే వద్ద చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఇంటికి వెళ్లి వచ్చిన సురేష్ ఇలా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. సురేష్ తమ తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు కాగా, తండ్రి జగన్నాథం గతంలో మరణించినట్లు తెలిపారు. అటు భర్త, ఇటు కుమారుడు మృతి చెందడంతో తల్లి దిక్కులేనిది అయ్యిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. సురేష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని జీఆర్పీ పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

### గృహోపకరణాలు దగ్ధం

టెక్కలి: స్థానిక రోటరీనగర్–1లో విద్యుత్ సరఫరాలో శనివారం ఒక్కసారిగా ఓల్టేజీ సమస్య తలెత్తడంతో పలువురు ఇళ్లల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. తరచూ విద్యుత్ సమస్యలతో ఇళ్లల్లో విలువైన గృహోపకరణాలు పాడైపోతున్నాయని.. వాటి మరమ్మతులకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో తరచూ ఓల్టేజీ సమస్యలు వినియోగదారులకు ఆర్థిక నష్టాన్ని తెచ్చి పెడుతున్నాయి.

# విద్యుత్ ఆదా... చేద్దాం పదా..!

- వేసవిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- స్వీయ నియంత్రణతో వృథాకు అడ్డుకట్ట



హిరమండలం: ప్రస్తుతం భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి తరుణంలో ఏ ఇంట చూసినా ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరుగుతోంది. వీటితో పాటు వాషింగ్ మిషన్లు, మిక్సీలు, కుక్కర్ల వంటి ఉపకరణాలను తప్పనిసరిగా వాడాల్సి వస్తోంది. ఫలితంగా ప్రతినెలా విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. అయితే బిల్లులు చూసి బెదిరిపోయే కంటే ముందుగానే విద్యుత్ పొదుపు పాటించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఉపకరణాల వాడకంలో ఆచుతూచి వ్యవహరిస్తే వృథా ఖర్చు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

**శ్రీకాకుళం జిల్లాలో...**

జిల్లాలో సుమారుగా 6.71 లక్షల గృహ వినియోగ అవసరాల కోసమే దాదాపు 80 శాతం విద్యుత్ వినియోగం జరుగుతోంది. రోజుకు సుమారు 60 లక్షల యూనిట్లు వినియోగిస్తున్నారు. దీనిలో కేవలం లైటింగ్ కోసం 20 శాతం వాడుతున్నారు. ఈ విషయంలో కొంచెం పొదుపు పాటిస్తే వృథా ఖర్చు తగ్గుతుంది. సాధారణ బల్బులకు బదులుగా ఎల్‌ఈడీ రకం పెట్టుకుంటే బిల్లు తక్కువ వస్తుంది. పగటిపూట లైట్లు అవసరం లేకుండా కిటికీలకు లేత రంగులుండే కర్టెన్లు వేస్తే కాంతి లోపలకు వస్తుంది.

**గృహ అవసరాలకు బిల్లు ఇలా..**

| యూనిట్లు | యూనిట్‌కు చార్జీ (రూ.ల్లో) |
|---|---|
| 0–30 | 3.25 |
| 31–75 | 4.00 |
| 76–125 | 4.50 |
| 126–225 | 6.00 |
| 226–400 | 8.75 |
| 400 పైన | 9.75 |

**పిల్లలకు నేర్పించండి**

విద్యుత్ ఆదాపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలి. సెలవులు కావడంతో అవసరం మేరకు మాత్రమే ఉపకరణాల వాడకం, నియంత్రణ విధానాలు పాటించేలా చూడాలి. బడిలోనూ విరామ సమయాల్లో ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని చెప్పాలి. ఇంట్లో కంప్యూటర్లు, టీవీలు ఎంత సమయం చూడాలి అవగాహన కల్పించాలి. చరవాణి, కెమెరాలకు అవసరం మేరకే చార్జింగ్ చేసుకోవాలి. రిఫ్రిజిరేటర్ డోర్ మాటిమాటికీ తీయకూడదని వారికి వివరించాలి.

**ఇవి పాటించండి**

- ఫ్రిజ్, గోడ మధ్య ఖాళీ ఉండేలా చూసుకోవాలి. లేకుంటే కంప్రెసర్ ఎక్కువగా పనిచేసి విద్యుత్ వృథాగా ఆస్కారం కలుగుతుంది.
- కొందరు వాషింగ్ మిషన్‌లో సామర్థ్యానికి మించి దుస్తులు వేస్తారు. అలాచేస్తే యంత్రం పనిచేసే సమయం పెరిగి కరెంట్ వాడకం ఎక్కువ అవుతుంది.
- టీవీ, కంప్యూటర్లు వాడకపోతే స్విచ్ఛాఫ్ చేయాలి.
- ఎలక్ట్రానిక్ పరికరాలు చార్జింగ్ పూర్తి కాగానే ప్లగ్‌ల నుంచి తొలగించాలి.
- ఎక్కువ చల్లదనం కోసం చాలామంది 18 డిగ్రీల వద్ద ఏసీ వినియోగిస్తుంటారు. అలా చేయకూడదు. ఎప్పుడూ 24 డిగ్రీల్లో ఉంచుకుంటే 20 శాతం విద్యుత్ ఆదా చేయగలం. గదిలో తలుపులు, కిటికీలు మూసిన తర్వాతే ఏసీ ఆన్ చేయాలి.
- మైక్రో ఓవెన్‌ను మాటిమాటికీ తీయకూడదు. అలాచేస్తే ఉన్న ఉష్ణోగ్రత తగ్గి తిరిగి వేడెక్కెందుకు మరింత సమయం పడుతుంది.
- ఆటోమెటిక్ ఆన్, ఆఫ్ విధానంతో పాటు 5 నక్షత్రాల ప్రమాణాలున్న ఉపకరణాలు కొనుగోలు చేయడం ఉత్తమం.

**అవగాహన అవసరం**



విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అవసరం మేరకు మాత్రమే ఉపకరణాలు వాడాలి. స్వీయ నియంత్రణతో వృథా ఖర్చు తగ్గించుకోవచ్చు. విద్యుత్ ఆదా చేసేందుకు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– జి.శంకర్‌రావు, విద్యుత్ శాఖ ఈఈ, టెక్కలి

# కొఠారీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

- వేతనదారుల ఆందోళన



ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా వెళ్లిన వేతనదారులతో మాట్లాడుతున్న విప్ అశోక్

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నారనే నెపంతో చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ఇచ్ఛాపురం మండలంలోని కొఠారీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్కోజి రవికుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డ్వామా పీడీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొఠారీ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఫిబ్రవరి నెలలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల ప్రజావేదికలో స్థానిక టీడీపీ నాయకుడు సాడి సహదేవరెడ్డి ఫిర్యాదు చేశాడు. దీంతో ఏప్రిల్ 10వ తేదీన ఉపాధి ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. అయితే సుమారు మూడు వందల మంది వేతనదారులు విచారణను అడ్డుకున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు తప్పుడు ఫిర్యాదు చేశాడని ఆరోపించారు. రాజకీయాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌ను బలి చేయవద్దని కోరారు. కానీ ఇదిలా ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను అవకతవకలకు పాల్పడిన కారణంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి.

**సస్పెన్షన్ ఎత్తివేయాలని విన్నపం**

దీంతో ఉపాధి వేతనదారులు పెద్ద ఎత్తున స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఆయన ఇంటి వద్ద కలిశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని, ఆయన నిజాయితీగా పనిచేస్తున్నాడని తెలియజేశారు. దీనిపై విప్ అశోక్ మాట్లాడుతూ అవకతవకలు చేశాడు కాబట్టే సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. వ్యక్తులను కాపాడాలని ఉపాధి కూలీలు చూడకూడదని, ఆయన కోసం కూలీలు రోడ్లు ఎందుకు ఎక్కాలంటూ ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఎలాంటి వాడో తనకు తెలుసని, ఈ ఫీల్డ్ అసిస్టెంట్ కాకపోతే మరో ఫీల్డ్ అసిస్టెంట్ వచ్చి ఇంకా బాగా చేస్తాడన్నారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని, అధికారులు చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే చెప్పడంతో కూలీలు వెనుదిరిగారు. అయితే చిరుద్యోగిపై ప్రభుత్వ విప్ స్థాయి వ్యక్తి మాట్లాడిన మాటలు ఇప్పుడు వీడియో రూపంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు తెరలేచిందని స్థానికులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు



ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతున్న దృశ్యం

గార: ఒక వైపు జాతీయ రహదారి, మరోవైపు జిల్లా జైలుకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంపై టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యుల కన్ను పడింది. దీంతో ఏకంగా ఆక్రమించేసి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అంపోలు పంచాయతీ మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుడు సోమేశ్వరరావు ఈ భూమిని ఆక్రమించుకున్నారు. సర్వే నంబర్–12లో సుమారు 6 సెంట్లు స్థలం దాదాపు రూ.50 లక్షలు విలువ చేస్తుంది. కొద్ది రోజుల క్రితం ఈ స్థలంను ఎత్తు చేసేందుకు మట్టి వేశాడు. ఇప్పుడు రాత్రి, పగలు సమయాల్లో జోరుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు అటువైపు చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురువుతున్నా పట్టించుకోవడం లేదని, సామాన్యులపై మాత్రమే అధికారం చూపుతుంటారని అంటున్నారు. ఈ విషయమై అంపోలు వీఆర్వో మోహనరావు వద్ద ప్రస్తావించగా కొద్దిరోజుల క్రితం మట్టి వేసే సమయంలో పనులు నిలిపేయమని చెప్పడం జరిగిందన్నారు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



ఇసుక ర్యాంపు వద్ద జేసీబీతో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని వంశధార నదిలో అంగూరు (ఆకులతంపర) ఇసుక ర్యాంపు నిర్వాహకులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ర్యాంపు పరిశీలించాల్సిన రెవెన్యూ, మైన్స్‌లతో పాటు పలు శాఖల అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనలు ప్రకారం నదిలో కూలీలచేత ట్రాక్టర్‌కు లోడ్ చేయించి స్టాక్ పాయింట్ వద్దకు తీసుకు రావాలి. స్టాక్ పాయింట్ నుంచి ట్రాక్టర్లతో పాటు టిప్పర్లకు జేసీబీలతో లోడ్ చేయించాలి. అయితే ఇలా చేయకుండా నదిలో కూడా ప్రొక్లెయిన్లతో రాత్రులు ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పగలు మాత్రమే ఇసుక రవాణా చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ విశాఖపట్నం, విజయనగరంతో పాటు ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు టిప్పర్లతో రాత్రులు రవాణా చేస్తున్నారు.

**ఒడిశాకు ఇసుక తరలింపు**

అంధ్రా నుంచి ఒడిశాకు ఇసుక రవాణా చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఒడిశాకు ఈ ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలుస్తోంది. నదిలో కూలీలతో ఒక మీటరు వరకు మాత్రమే తవ్వకాలు జరగాలి కానీ, ఇక్కడ యంత్రాలతో రెండు నుంచి మూడు మీటర్ల వరకు తవ్వకాలు చేస్తున్నారు. ఈవిధంగా చేయడం వలన నదీ పరివాహక ప్రాంతంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఒక టన్ను ఇసుక తవ్వకం, స్టాక్ పాయింట్ వరకు రవాణా, పరిపాలన ఖర్చుతో పాటు జీఎస్టీ కలుపుకొని మొత్తం రూ.167లుగా ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు విరుద్ధంగా టన్నుకు సుమారు రూ.500ల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందువలన సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ వద్ద ప్రస్తావించగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపినట్లు రుజువైతే, ఇసుక ర్యాంపు నిర్వాహకుడిపై చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే వాహనాలు సీజ్ చేయడం తరుగుతుందని పేర్కొన్నారు.



మీటర్ కంటే ఎక్కువ లోతు తవ్విన వైనం

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటన స్థలంలో దశరథ మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం ఆర్‌జే బొడ్డపాడు గ్రామానికి చెందిన బుడ్డ దశరథ(43) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు దశరథ కోటబొమ్మాళి మండలం గంగరాం గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు శుక్రవారం వెళ్లాడు. అనంతరం తిరిగి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తన గ్రామానికి వెళ్తున్న క్రమంలో టెక్కలి సమీపంలోని శ్యామసుందరాపురం గ్రామ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అయితే మృతుడికి మొదటి భార్య మృతి చెందడంతో ఇటీవలే రెండో వివాహం జరిగింది. మృతుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

### రైలు ఢీకొని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహం

కాశీబుగ్గ/ఇచ్ఛాపురం: పలాస జీఆర్పీ పరిధి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో బహుదా నది రైలు వంతెనపైన వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వ్యక్తి వంతెన దాటుతున్న తరుణంలో ఒక్కసారిగా రైలు రావడంతో ఎటు పోవాలో తెలియక ఉండిపోవడం వలన ప్రమాదం చోటుచేసుకుందని జీఆర్పీ పోలీసులు భావిస్తున్నారు. వృద్ధుడి వయస్సు 65–70 సంవత్సరాలు మధ్య ఉంటుందని, తెల్లని రంగు షర్టు పైన నిలువుగా నల్లని గీతలు, ఎర్రని లుంగీ కట్టుకున్నారని తెలిపారు. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపడితే 94406 27567 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# తాగునీరు అడ్డగింత

- కూటమి నాయకుడి నిర్వాకం



నిలిచిన పైప్‌లైన్ తవ్వకాలు

ఇచ్ఛాపురం రూరల్: ప్రజల అవసరాలకు, వారి దాహార్తిని తీర్చేందుకు వెళ్లిన సిబ్బందిపై బూతు పురాణం అందుకొని తాగునీటిని అడ్డుకున్నాడో కూటమి నాయకుడు. దీంతో గత రెండు రోజులుగా స్థానిక ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తేలుకుంచి గ్రామానికి జల్ జీవన్ మిషన్ పథకం నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. మూడు రోజుల క్రితం గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేసే క్రమంలో పూర్తిగా పైప్‌లైన్ బద్ధలైపోవడంతో తాగునీరు వృథాగా పోయింది. దీంతో స్థానిక సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి చొరవతో జల్ జీవన్ మిషన్ పైప్‌లైన్‌ను ఉద్దానం ప్రాజెక్ట్‌కు అనుసంధానం చేసేందుకు రెండు రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ వర్కర్లు పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న స్థానిక కూటమి నాయకుడు తనకు తెలియకుండా పైప్‌లైన్ ఎలా వేస్తారో చూస్తానంటూ బూతులు తిట్టడంతో వర్కర్లు అక్కడ నుంచి వెనక్కి వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం గ్రామంలో తాగునీరు లేక స్థానిక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విష్ణుమూర్తి వివరణ కోరగా.. స్థానిక ఎంపీటీసీ ప్రతినిధి పైప్‌లైన్ పనులు అడ్డుకోవడంతో గ్రామానికి తాగునీరు అందివ్వలేకపోతున్నామని తెలిపారు. ఈ అంశంపై సదరు వ్యక్తి మేరుగు సూర్యనారాయణ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుడిగా తనకు తెలియకుండా పైప్‌లైన్ పనులు చేయడం సరికాదని, తన సొంత స్థలంలో తన ప్రమేయం లేకుండా తవ్వకాలు జరపడంతో పైప్‌లైన్ పనులు అడ్డుకున్నానని తెలిపారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి శనివారం తమ గ్రామానికి తాగునీరు అందివ్వాలని కోరుతూ ఈవోపీఆర్డీకి వినతిపత్రం అందించారు.

# ఉపాధి 'హాని'

- ఉపాధి పనుల్లో రాజకీయాలు
- పెత్తనం చెలాయిస్తున్న కూటమి కార్యకర్తలు
- అనుకూలంగా ఉన్నవారు పనికిరాకపోయినా మస్తర్లు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు



బూరగాంలో గెడ్డ బంజీరు చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

టెక్కలి: గ్రామాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు స్థానికంగా చేతినిండా పని కల్పించే ఉపాధి హామీ పనుల్లో రాజకీయాలు చొరబడ్డాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటినుంచి కూటమి కార్యకర్తలు పెత్తనం చెలాయిస్తున్నారు. నిన్నటివరకు కొనసాగిన క్షేత్ర సహాయకులను రాజకీయ ప్రమేయంతో తొలగించి, ఆయా స్థానాల్లో కూటమి కార్యకర్తలు కర్ర పెత్తనం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి అనుకూలంగా ఉన్నవారు సమయానికి పనులకు రాకపోయినా, పూర్తిస్థాయిలో పనులకు వెళ్లకపోయినా మస్తర్లు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కుంటి సాకుతో కొంతమంది వేతనదారులకు పని డిమాండ్లు కల్పించకపోవడం, సమీపంలో పనులు ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాలకు పనులకు పంపించడం వంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఉపాధి హామీ పథకం లాగిన్‌ను అనధికారకంగా ఉపయోగిస్తూ వివిధ రకాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

**లాగిన్ దుర్వినియోగం**

టెక్కలి మండలం బూరగాం పంచాయతీలో కొద్దిరోజుల క్రితం రాజకీయ ప్రమేయంతో క్షేత్ర సహాయకుడిని తొలగించారు. అనంతరం క్షేత్ర సహాయకుడు కోర్టును ఆశ్రయించాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్నటువంటి మరో క్షేత్ర సహాయకురాలికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉపాధి పనుల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. కొంతమందికి కక్ష సాధింపుగా పనులు కల్పించకపోవడం, మరికొంతమంది పనులకు వెళ్లపోయినా మస్తర్లు వేయడం, సమీపంలో పనులు ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాలకు పనులకు పంపించడం వంటి చేష్టలు చేస్తున్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ లాగిన్ సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సీతాపురం గ్రామానికి సంబంధించి క్షేత్ర సహాయకుడిని తొలగించేందుకు కొంతమంది కూటమి కార్యకర్తలు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే గ్రామంలో వేతనదారులంతా క్షేత్ర సహాయకుడికి మద్దతు పలకడంతో తొలగింపు విషయంలో వెనుకడుగు వేశారు. ఇదిలా ఉండగా జనసేన పార్టీకి చెందిన ఒక వ్యక్తికి అనధికారకంగా ఉపాధి హామీ పథకం కార్యకలాపాలు అప్పగించారు. దీనిపై వేతనదారులంతా తిరుగుబాటు చేస్తుండడంతో ఇక్కడ క్షేత్ర సహాయకుడి తొలగింపు అధికారులకు తలనొప్పిగా మారింది. అయితే ఎటువంటి బాధ్యతలు అప్పగించకుండా కూటమి కార్యకర్తకు లాగిన్ అప్పగించడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై ఏపీవో ప్రసాద్ వద్ద ప్రస్తావించగా బూరగాం, సీతాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడా వేతనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

**అక్రమాలకు తెర తీస్తున్నారు**



వలసల నివారణకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా రాజకీయం చేసేశారు. పలువురు క్షేత్ర సహాయకులను అన్యాయంగా తొలగించారు. కొన్నిచోట్ల కూటమి కార్యకర్తలే క్షేత్ర సహాయకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని తెలిస్తే వేతనదారులను ఎన్నో ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తెర తీస్తున్నారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, టెక్కలి